# శిథిల సంక్షేమం

## వసతి గృహాల్లో క్షేమమూ సంక్షేమమూ కరవు



సంక్షేమ హాస్టళ్ల దుస్థితి గురించి ఈ మధ్య మీడియాలో కథనాలు విశేషంగా వచ్చాయి. నిత్యం వినడానికి అలవాటు పడిపోయిన అవినీతిని గురించి వార్తలు విన్నట్టే నిర్లిప్తంగా వీటి గురించీ విన్నాము, చదివాము. ముల్లులా గుచ్చుకుంటున్నప్పటికీ కూడా కొన్ని సమస్యలను 'అవంతేలే' 'షరా మామూలే' అని అనుకొని వదిలేయడానికి అలవాటు పడిపోతాం. ప్రభుత్వ బాధ్యతల, ప్రాధాన్యతల జాబితాలో మొట్టమొదటన ఉండాల్సిన 'సంక్షేమం' ఊరి చివరి దళితవాడలా చిట్టచివరికి జారిపోతున్నా దాన్ని కూడా 'అదంతేలే' అనుకుని సరిపెట్టేసుకుంటున్నాం.

రాష్ట్రంలోని ఎస్.సి, ఎస్.టీ, బి.సీ సంక్షేమ వసతి గృహాలలో నివసిస్తున్న విద్యార్థులు చాలా దయనీయ స్థితుల్లో జీవిస్తున్నారు. అనేక హాస్టళ్లకు సొంత భవనాలు లేవు. ఇరుకు అద్దె కొంపల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అద్దె బకాయిలు తీర్చకపోవడంతో ఖాళీ చేయండంటూ ఇళ్ల యజమానులు డిమాండ్ చేస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దశాబ్దాల తరబడి మరమ్మతులకు నోచుకోక సొంత భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. లీకవుతున్న, పెచ్చులూడుతున్న స్లాబులూ, గోడలూ పిల్లల్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. నీటి వసతి లేని హాస్టళ్ల సంఖ్యకు కొదువ లేదు. బాలికల హాస్టళ్లలో మరుగుదొడ్ల స్థితి వర్ణనాతీతం. బాలల వసతి గృహాలలోనైతే మరుగుదొడ్లు కూడా ఉండట్లేదు. కనీసం పాడయిన మరుగుదొడ్లనైనా మరమ్మతు చేయించాలనే యింగిత జ్ఞానం కూడా ప్రభుత్వానికి గానీ, అధికారులకుగానీ ఉన్నట్టు కనిపించదు. వారి ఉదాసీనత ఎంతవరకు వెళ్లిందనన్నది ఉదహరించడానికి విశాఖపట్నానికి కూతవేటు దూరంలో ఉన్న భీమిలిలోని ఒక ఎస్సీ హాస్టల్ భవనం గురించి చెప్పుకోవాలి. వానలకు నాని గోడల్లో కరెంటు ప్రవహించడం గమనించి కూడా పిల్లలకు ఏమవుతుందోననే చీకూ చింతా లేకుండా అధికారులు గడిపేస్తున్నారన్న వాస్తవం మనలో భయాన్ని రేకెత్తిస్తుంది. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల మరమ్మతుల కోసమని ఒక్కోదానికి సుమారు రూ. 1.7 లక్షలను కేటాయించినట్లు మొన్న మే నెలలో ప్రకటించింది. మరమ్మతులను జులై 2012 కల్లా పూర్తిచేయాలని ఆదేశాలను కూడా ఇచ్చింది. కానీ ఇంత వరకూ నిధులు విడుదల చేసిన పాపాన పోలేదు.

**సంక్షేమానికి గ్రహణం :** స్వతంత్రం తర్వాత ప్రైవేటు వ్యక్తుల ద్వారా ప్రభుత్వం వసతి గృహాలను నిర్వహించేది. ఆర్థిక అక్రమాల నేపథ్యంలో వాటి నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలన్న ఆందోళనలు జరిగాయి. ఆ తరువాత 1973-74 నుంచీ సాంఘిక సంక్షేమ శాఖే వాటిని నిర్వహించడం మొదలెట్టింది. ఎంత లోపభూయిష్టంగా నడిచినప్పటికీ ఈ వసతి గృహాలు సత్ఫలితాలనే ఇచ్చాయని చెప్పుకోవాలి. అనేక ఆందోళనలకు స్పందనగా, ప్రభుత్వ సంక్షేమ భావనలో భాగంగా క్రమేణా హాస్టళ్లకు సొంత భవనాలూ, విద్యార్థులకు దుస్తులూ, దుప్పట్లూ, ట్రంకుపెట్టెలూ, భోజన సదుపాయాలూ, నోట్‌పుస్తకాలూ వగైరా సౌకర్యాలన్నీ వచ్చాయి. ఎనభైల వరకూ ఈ వొరవడిలో కొనసాగిన వసతి గృహాలకు ఆ తర్వాత గ్రహణం పట్టింది.

వసతి గృహాలను ప్రభుత్వమే నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టింది. పిల్లల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు దారి మళ్లాయి. హాస్టళ్లలో చదువుకునేందుకు ముందుకువచ్చే ఎస్.సి., ఎస్.టీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినా వసతి గృహాల సంఖ్య ఆ క్రమంలో పెరగలేదు. కనీస సదుపాయాల కల్పనలో పూర్తి ఉదాసీనత మొదలయ్యింది. ఇప్పుడైతే హాస్టళ్లలో చేరేవారి సంఖ్య తగ్గిందని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. నిజమే కూడా. దీనికి కారణంగా ఎన్నో విషయాలను ప్రభుత్వం చెబుతున్నప్పటికీ హాస్టళ్లు అధ్వాన్నంగా తయారవ్వడం, పరిశుభ్రత లోపించడం, పిల్లల చదువు పట్ల శ్రద్ధ వహించే అధికారులు కరువవడం వంటి విషయాలను తల్లిదండ్రులు దానికి ప్రధాన కారణాలుగా ఎత్తి చూపుతున్నారు. నిజానికి హాస్టళ్లకు డిమాండ్ ఉన్న ప్రదేశాల్లో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. హాస్టల్లో 100కు మించి సీట్లు ఇవ్వకూడదని సెక్రటరీ స్థాయి అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నట్లు జిల్లా అధికార్లు చెబుతున్నారు.

ఇక స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం




*ప్రభుత్వ బాధ్యతల, ప్రాధాన్యతల జాబితాలో మొట్టమొదటన ఉండాల్సిన 'సంక్షేమం' ఊరి చివరి దళితవాడలా చిట్టచివరికి జారిపోతోంది.*

*ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఈ సంక్షేమ సూత్రాలకు అనుగుణంగా ఉండకపోగా ఉద్దేశపూర్వకంగా ఈ వర్గాల ప్రజలకు విద్యను తిరస్కరిస్తున్నాయి. రాజ్యాంగంలో పొందుపర్చుకున్న ఈ లక్ష్యాలేవీ ఎవరో రాసినవి కావు. అనేక సామాజిక సంఘర్షణల ఫలితంగా, ఒక రాజకీయ ప్రక్రియ ద్వారా ఒక విలువగా, ప్రమాణంగా, హక్కుగా వచ్చి చేరినవి. ఇప్పుడు ప్రభుత్వాలు తమకు సంక్షేమ బాధ్యత లేదన్నా, దొడ్డిదారిన తప్పుకున్నా మనం ఒప్పుకోవలసిన అవసరం లేదు.*

అందిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటోంది. నిజానికి హాస్టళ్లను ఎత్తివేయడానికే ఈ ఎత్తుగడ అని విమర్శలు వస్తున్నాయి. ఒక పూట స్కూల్‌లోనూ, రెండోపూట హాస్టల్లోనూ పిల్లలు తినాలని చెప్పి మధ్యాహ్నం భోజనాన్ని హాస్టళ్లలో ఎత్తేసారు. మధ్యాహ్నం ఎలాగో స్కూల్లో పిల్లలకు భోజనం దొరకుతోంది కదా ఇక అలాంటప్పుడు ఒక పూట కోసమని చెప్పి బందిలదొడ్ల లాంటి హాస్టళ్లకు పంపడం ఎందుకు అని అనుకునే స్థితికి తల్లిదండ్రులను ఈ పథకం చేర్చింది. పోనీ ఈ మధ్యాహ్న భోజనం ఎమైనా నాణ్యమైనదా అంటే అదీ లేదు.

**కూలిన ట్యూటర్ల వ్యవస్థ :** ప్రభుత్వ బడుల్లో చదువులు అంతంత మాత్రంగా తయారయ్యాయి. దీని మూలంగా హాస్టళ్లలో ఉండే పిల్లల చదువు మరీ దెబ్బతింది. పిల్లల చదువు చెప్పడం కోసమని హాస్టళ్లలో ట్యూటర్‌లను నియమించారు. బడులలో చదువుల నాణ్యత తగ్గిన నేపథ్యంలో, విద్యార్థులపై టీచర్ల వ్యక్తిగత శ్రద్ధకు అక్కడ ఆస్కారం లేని



పరిస్థితులలో ఈ ట్యూటర్ల వ్యవస్థ కొంతవరకు సంక్షేమ హాస్టళ్ల పిల్లలకు ఉపయోగపడింది. పిల్లల మానసిక, శారీరక, మేధో అవసరాలను అన్నింటినీ ఈ ట్యూటర్ల వ్యవస్థ తీర్చింది అనలేము గాని విద్యార్థులకు చదువు అబ్బడానికి బాగానే దోహదపడింది. ట్యూటర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ. 500 కు మించి కొన్నేళ్లుగా పెంచకపోవడంతో టీచర్లు ఎవరూ ముందుకురావడం లేదు. ప్రభుత్వం వారి వేతనం పెంచడం లేదు. చివరకు ఈ వ్యవస్థా కుప్పకూలిపోయింది.

ప్రీ-మెట్రిక్ హాస్టళ్లలో పిల్లలకు ఏడాదికి రెండు జతల యూనిఫారాలు ఇవ్వాలి. వాటికి కుట్టుకూలి జతకి కేవలం రూ. 40 చెల్లిస్తున్నారు. చిన్న పిల్లల గౌను కూడా ఏ దర్జీ ఆ ధరకు కుట్టకపోవచ్చు. పైపెచ్చు ఆ మొత్తాన్ని కూడా ఎప్పటికో గాని ఇవ్వట్లేదు. కాస్మెటిక్ చార్జీలు జనవరి 2012 నుంచి అనేక చోట్ల రాలేదు. భోజనం, ఉదయం టిఫినూ, సాయంత్రం స్నాక్స్ అన్నీ కలిపి ఏడవ తరగతి లోపు పిల్లలకయితే నెలకు రూ. 470, ఏడు నుంచి పది లోపు వారికయితే రూ. 500 చెల్లిస్తున్నారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేటి రోజుల్లో ఆ ధరతో పిల్లలకు పౌష్టికాహారం పెట్టడం సాధ్యమవుతుందా? నీళ్ల చారూ, పప్పు నీళ్లూ, నాసిరకం బియ్యంతో వండిన అన్నం ఇవీ వారికి పెడుతున్న పంచభక్ష్యాలు. ఆదివారం పూట బిర్యానీ, ప్రతిరోజూ స్వీటూ లేదా పండూ, మజ్జిగా, వివిధ రకాల కాయగూరలూ, సాంబారూ, పులిహోరాలు వగైరా అన్నీ అయ్యవార్ల రిపోర్టులలోనే, నోటిసు బోర్డులమీదే. కంచాల్లో మటుకు కటిక మెతుకులే. ఇంత దరిద్రంలోనూ వార్డెన్ల అవినీతి. అందరూ అని కాదు కాని పిల్లల పొట్ట కొట్టే అవినీతి అధికారుల, వార్డెన్ల సంఖ్య తక్కువేమీ కాదు.

ఇక కాలేజీ, ఉన్నత చదువులు చదివే ఈ వర్గాల విద్యార్థులకు ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్ ఇచ్చేసి విద్యను అందించే సంక్షేమ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవడం కొన్నేళ్ల క్రితమే మొదలయ్యింది. చివరకు అది కూడా భారమయినట్టుంది! రోజుకో మాట మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది.

**సంక్షేమం బాధ్యత ప్రభుత్వాలదే :** ఒక పక్క విద్యా వైద్య రంగాలను బలహీనపరచిందీ పాలకులే. ఈ విషయంలో తరతమ భేదం లేదు, పార్టీలు ఏవైనా కూడా. మరోపక్క పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం గురించి మాట్లాడుతున్నదీ వారే. బడులనూ, కాలేజీలనూ, ఆసుపత్రులనూ పట్టించుకోవడం మానేసి పథకం ప్రకారం సర్వనాశనం చేసి ఇప్పుడేమో నాణ్యమైన విద్యయినా, ఆరోగ్య రక్షణ అయినా ప్రయివేటు వ్యవస్థలలోనే సాధ్యం అంటున్నారు. 'ప్రభుత్వ రంగంలో టీచర్లు చదువు చెప్పరు, వైద్యులు వైద్యం చెయ్యరు, మేము మీకు డబ్బిస్తాం గదా, మీరు నాణ్యమైన అవకాశాలు పొందవచ్చు' అని చెప్పుకు వస్తున్నాయి ప్రభుత్వాలు. ఆ వ్యవహారం ఎంత సజావుగా నడుస్తుందో ఇటీవలి ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల ఫీజు మడతపేచీ, ప్రభుత్వ ఊగిసలాట ధోరణులు తేటతెల్లం చేసాయి.

సంక్షేమ బాధ్యత నుంచి ప్రభుత్వాలు వైదొలగుతున్నాయి. ఆ బాధ్యత తమకు లేదని స్పష్టంగా చెబుతున్నాయి. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ విధానాలు రాజ్యాంగ లక్ష్యాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఆరోగ్యం, స్వేచ్ఛ, గౌరవం కలిగిన పరిస్థితుల్లో పిల్లలు ఎదగడానికి తగిన సౌకర్యాలనూ, అవకాశాలనూ కల్పించాలని రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో రాసుకున్నాం. ఆదాయాల్లోనూ, సౌకర్యాలలోనూ, అవకాశాలలోనూ, స్థితిగతులలోనూ అసమానతలను తొలగించే దిశగా ప్రభుత్వం తన విధానాలను రూపొందించాలని 38వ ఆర్టికల్ క్లాజ్ 2 చెబుతోంది. ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల విద్య, ఆర్థిక ప్రయోజనాల విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ, ప్రజల జీవన ప్రమాణాలనూ, ఆరోగ్యాన్ని పెంపొందించే బాధ్యతను ప్రభుత్వం ప్రాథమిక విధిగా భావించాలని 46, 47వ ఆదేశిక సూత్రాలు చెబుతున్నాయి. విద్యాహక్కు చట్టం 6 నుంచి 14 ఏళ్ల వయసు బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను గ్యారంటీ చేస్తూనే ఆ బాధ్యతను ప్రయివేటు రంగానికి అప్పచెప్పింది. సంక్షేమం పట్ల ప్రభుత్వానికి లేని బాధ్యత ప్రయివేటు రంగానికి ఎందుకు ఉంటుంది? ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఈ సంక్షేమ సూత్రాలకు అనుగుణంగా ఉండకపోగా ఉద్దేశపూర్వకంగా ఈ వర్గాల ప్రజలకు విద్యను తిరస్కరిస్తున్నాయి. రాజ్యాంగంలో పొందుపర్చుకున్న ఈ లక్ష్యాలేవీ ఎవరో రాసినవి కావు. అనేక సామాజిక సంఘర్షణల ఫలితంగా, ఒక రాజకీయ ప్రక్రియ ద్వారా ఒక విలువగా, ప్రమాణంగా, హక్కుగా వచ్చి చేరినవి. ఇప్పుడు ప్రభుత్వాలు తమకు సంక్షేమ బాధ్యత లేదన్నా, దొడ్డిదారిన తప్పుకున్నా మనం ఒప్పుకోవలసిన అవసరం లేదు. పాలకుల దయాదాక్షిణ్యాల మీద కాకుండా ఒక హక్కుగా సంక్షేమాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరాన్ని మనమంతా గుర్తెరగాలి. దానికోసం ఉద్యమిద్దాం, ప్రభుత్వం ఎందుకు దిగిరాదు?


**మానవహక్కుల వేదిక**

**HUMAN RIGHTS FORUM (HRF)**

విశాఖపట్నం జిల్లా


తేది. 15-9-2012


ప్రచురణ కర్త : **ఎస్. జీవన్ కుమార్**-9848986286, **ఎమ్. శరత్**-9440169172